క్లుప్తంగా

శాకాంబరిగా బాటగంగమ్మ



విశేషాలంకరణలో బాటగంగమ్మ

బైరెడ్డిపల్లి: బాటగంగమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న మండల పూజల్లో భాగంగా ఆదివారం అమ్మవారు శాకాంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. అర్చకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేపట్టారు.

నేడు వాహనాల వేలం

పుంగనూరు: వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను పట్టణంలోని ఎస్ఈబీ స్టేషన్ ఆవరణలో సోమవారం 10 గంటలకు వేలం వేయనున్నట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆసక్తి గల వారు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

కుప్పం సెబ్ కార్యాలయంలో..

రామకుప్పం: వివిధ కేసుల్లో పట్టుబడిన మూడు ద్విచక్ర వాహనాలను సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు కుప్పం సెబ్ కార్యాలయంలో వేలం వేయనున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆసక్తి గలవారు వేలంపాటలో పాల్గొనవచ్చని సూచించారు.

86 మందికి కంటి పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పుంగనూరు: పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. క్లబ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ శివ, డాక్టర్ సరళ, క్లబ్ అధ్యక్షుడు శ్రీరాములు ఆధ్వర్యంలో కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాల వైద్యులు శిబిరానినికి హాజరై 86 మందికి పరీక్షలు చేశారు. 21మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. డాక్టర్ శివ మాట్లాడుతూ ఎంపికైన వారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించి, కంటి అద్దాలు అందిస్తామన్నారు.కార్యక్రమంలో ఈశ్వరమ్మ, గోపాలకృష్ణ, సురేష్ పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మకు ప్రాకారోత్సవం



ఊరేగుతున్న గంగమ్మ

కుప్పం: స్థానిక పాతపేటలోని ప్రసన్న పెద్దపల్లె గంగమ్మ ఆలయంలో ఆదివారం వైభవంగా ప్రాకారోత్సవం నిర్వహించారు. పలక వాయిద్యాల నడుమ అమ్మవారిని ఊరేగించారు. పెద్దసంఖ్యలో భక్తులు గంగమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

గడ్డివాము దగ్ధం

పుంగనూరు: మండలంలోని నల్లగుట్లపల్లె వద్ద చెంగారెడ్డి అనే వ్యక్తికి చెందిన గడ్డివాము ఆదివారం సాయంత్రం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. దీనిపై సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖాధికారి సుబ్బరాజు ఆధ్వర్యంలో సిబ్బంది వెంకటరమణ, లోకేష్‌రెడ్డి, వినోద్‌కుమార్ హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు. ప్రమాదంలో సుమారు రూ.25వేల విలువైన గడ్డి ఆహుతైనట్లు బాధితుడు తెలిపాడు.

అనాథకు అంతిమ సంస్కారం



మృతదేహాన్ని ఖననం చేయిస్తున్న పోలీసులు

పలమనేరు: పట్టణ సమీపంలోని ఆర్‌టీఓ చెక్ పోస్టు వద్ద రెండు రోజుల క్రితం ఓ వ్యక్తి మృతి చెందాడు. అనాథ కావడంతో అంత్యక్రియలు జరిపించేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ఈ క్రమంలో పట్టణ పోలీసులు దగ్గరుండి అంతిమసంస్కారాలను ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ సుబ్బారెడ్డి, సిబ్బంది రిజ్వాన్, మణికంఠ పాల్గొన్నారు.

ముమ్మరంగా సాగుతున్న ఫోర్ వే లైన్ పనులు





కుప్పం రైల్వేస్టేషన్‌కు మహర్దశ

- శరవేగంగా ఫోర్ వే నిర్మాణం
- త్వరలోనే మారికుప్పం లైన్ పనులు ప్రారంభం
- జంక్షన్‌గా అప్‌గ్రేడ్ చేసేందుకు చర్యలు

కుప్ప రైల్వేస్టేషన్‌కు మహర్దశ పట్టనుంది. అమృత్ భారత్ స్టేషన్ పథకానికి ఎంపిక కావడంతో అభివృద్ధికి మార్గం సుగమమైంది. ఫోర్ వే లైన్ పనుల్లో భాగంగా స్టేషన్ మరింత విశాలంగా మారనుంది. ఈ క్రమంలో మూడో ఫ్లాట్‌ఫామ్ నిర్మాణం జోరుగా సాగుతోంది. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అలాగే రైల్వే జంక్షన్‌గా మార్చే దిశగా అడుగులు వేస్తోంది. దీంతో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కుప్పంలో స్టాపింగ్ ఇచ్చే అవకాశముంది.



కుప్పం రైల్వే స్టేషన్

కుప్పం: బ్రిటిష్ హయాంలో ఏర్పాటు చేసినా కుప్పం రైల్వే స్టేషన్ రూపు రేఖలు మారనున్నాయి. చెన్నై–బెంగళూరు జాతీయ రైల్వే మార్గంలో ఉండడంతో ఈ స్టేషన్ అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. అందులో భాగంగా తొలుత అమృత్ భారత్ స్టేషన్‌కు పథకానికి కుప్పం రైల్వేస్టేషన్‌ను ఎంపిక చేసింది.

ముమ్మరంగా ఫోర్ వే పనులు

బెంగళూరు– చెన్నై మార్గంలో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు కుప్పం మీదుగానే వెళుతున్నాయి. రద్దీ ఎక్కువగా ఉండడంతో ప్రస్తుతం ఫోర్ వే లైన్ నిర్మిస్తున్నారు. వందే భారత్ తదితర రైళ్ల వేగానికి తట్టుకునేలా పటిష్టంగా ట్రాక్ ఏర్పాటు చేస్తున్నారు. కుప్పం ప్రాంతంలో ఫోర్ వే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందుకోసం ప్రత్యేకంగా మూడో ఫ్లాట్‌ఫామ్ సైతం నిర్మిస్తున్నారు.

మారికుప్పం రైల్వే లైను

కుప్పం రైల్వే స్టేషన్ నుంచి ద్రవిడ వర్సిటీ మీదుగా కర్ణాటకలో మారికుప్పం స్టేషన్ వరకు ప్రత్యేకంగా నూతన లైన్ నిర్మాణానికి కేంద్రప్రభుత్వం చర్యలు చేపట్టింది. కర్ణాటక నుంచి జిల్లా సరిహద్దు వరకు పనులు ప్రారంభించారు. కుప్పం, గుడుపల్లె మండలాల్లో భూసేకరణ పూర్తి కాకపోవడంతో ఇక్కడ పనులు మొదలుపెట్టలేదు. ఈ క్రమంలో కలెక్టర్ హరినారాయణన్ ఇటీవల రైల్వే లైన్ భూసేకరణపై దృష్టి సారించారు. నిర్వాసితులకు పరిహారంపై ప్రతిపాదనలను త్వరితగతిని సిద్ధం చేయాలని ఆదేశించారు. త్వరలోనే మారికుప్పం రైల్వే లైన్ పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

అత్యాధునిక వసతులు

కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టినా అమృత్ భారత్ స్టేషన్ పథకంలో కుప్పం రైల్వే స్టేషన్‌కు స్థానం దక్కింది. దీంతో స్టేషన్‌లో ప్రయాణికులకు అత్యాధునిక వసతులు అందుబాటులోకి రానున్నాయి. లిఫ్ట్, అదనపు ఫ్లాట్‌ఫామ్, నవీన విద్యుదీకరణ సమకూరనున్నాయి.

జంక్షన్‌గా అప్‌గ్రేడ్

కుప్పం రైల్వే స్టేషన్ త్వరలోనే జంక్షన్‌గా అప్‌గ్రేడ్ కానుంది. ఇక్కడికి సమీపంలోని తమిళనాడులోని జోలార్‌పేట, కర్ణాటకలోని బంగారుపేట స్టేషన్లు ఇప్పటికే జంక్షన్‌గా ఉన్నాయి. ఈ క్రమంలో కుప్పం స్టేషన్‌ను కూడా జంక్షన్‌గా మార్చాలన్న చిరకాల కోరిక ఇన్నాళ్లకు నెరవేరుతోందని స్థానికులు చెబుతున్నారు. జంక్షన్ అయితే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ ఉంటుందని వెల్లడిస్తున్నారు.



చిన్నారికి ఆశీస్సులు..

పెద్దగొట్టిగల్లు సమీపంలోని కల్యాణమండపంలో ఆదివారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ నేత మాధవరెడ్డి మనుమడు మహాన్‌రెడ్డి నామకరణ మహోత్సవానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరయ్యారు. ఉన్నతస్థాయికి ఎదగాలని చిన్నారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు జింకా చలపతి, ఎంపీపీ పురుషోత్తంరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్, పులిచెర్ల సింగిల్ విండో అధ్యక్షుడు రెడ్డీశ్వర్‌రెడ్డి, నాయకులు కొండవీటి నాగభూషణం, కమలాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

–రొంపిచెర్ల

పకడ్బందీగా ఆక్రమణల తొలగింపు



జేసీబీతో ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

పలమనేరు: పురపాలక పరిధిలోని ఆక్రమణలను తొలగింపునకు ఆదివారం అధికారులు శ్రీకారం చుట్టారు. మున్సిపల్ సాధారణ సమావేశంలో సభ్యులు తెలిపిన వివరాల మేరకు ఎద్దుల సంతవీధిలోని మర్కస్ కాంప్లెక్స్ సదర్‌కు ముందస్తుగా నోటీసులను జారీ చేశారు. వారు స్పందించకపోవడంతో మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ తమ సిబ్బందితో కలసి రోడ్డుపై ఉన్న ఆక్రమణలను తొలగింపునకు చర్యలు చేపట్టారు. వ్యాపారులు అడ్డుకునేందుకు యత్నించడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 17 దుకాణాల ముందు ఆక్రమణలను జేసీబీ సాయంతో తొలగించారు. కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో ఆక్రమణలను తొలగించనున్నట్టు తెలిపారు.

మంత్రి పెద్దిరెడ్డిని విమర్శిస్తే సహించం



మాట్లాడుతున్న ఎంపీపీ పురుషోత్తంరెడ్డి

రొంపిచెర్ల: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని విమర్శిస్తే సహించే ప్రసక్తే లేదని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో లోకేష్ అవాకులు చెవాకులు మాట్లాడుతున్నారని, మంత్రి పెద్దిరెడ్డిపై దిగజారుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రి పెద్దిరెడ్డి విమర్శించే స్థాయి లోకేష్‌కు లేదని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీని ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చిత్తుగా ఓడిస్తామని తెలిపారు. వార్డు మెంబర్‌గా కూడా గెలవలేని లోకేష్ పాదయాత్ర ఓ కామెడీ షో మాదిరిగా సాగుతోందని ఎద్దేవా చేశారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మళ్లీ వైఎస్సార్‌సీపీనే గెలవడం తథ్యమన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్ రెడ్డి, పులిచెర్ల సింగిల్‌విండో అధ్యక్షుడు రెడ్డీశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం ప్రధాన కార్యదర్శి యుగంధర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, హరికృష్ణారెడ్డి, నాగరాజా, ఓ.సిద్ధారామిరెడ్డి పాల్గొన్నారు.

సమష్టి కృషితో మరింత బలోపేతం



ప్రచార సామగ్రి కిట్ అందిస్తున్న రుక్మిణమ్మ తదితరులు

చౌడేపల్లి: సమష్టి కృషితోనే పార్టీని మరింత బలోపేతం చేయగలమని సచివాలయాల మండల కన్వీనర్ రుక్మిణమ్మ తెలిపారు. ఆదివారం లద్దిగం, పుదిపట్ల, చింతమాకులపల్లె, కొండయ్యగారిపల్లె, పెద్దయల్లకుంట్ల గ్రామాలకు చెందిన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు ద్వారా చేకూరిన లబ్ధిని వివరించాలన్నారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి ఒక్కరి మద్దతు తీసుకుని ఇంటికి పార్టీ స్టిక్కర్ అంటించాలని కోరారు. అనంతరం ప్రచార సామగ్రి కిట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరసింహులుయాదవ్, కో–ఆప్షన్ సభ్యుడు సాదిక్, సింగిల్ విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, సింగిల్ విండో డైరక్టర్ రమేష్‌బాబు, పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ కల్యాణ్, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, సర్పంచ్‌లు సుజాత, హైమావతి, అనూరాధ, రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

సోషల్ మీడియా మండల కన్వీనర్‌గా రమేష్



రామకుప్పం: వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా మండల కన్వీనర్‌గా చెల్డిగానిపల్లెకు చెందిన రమేష్ నియమితులయ్యారు. కో–కన్వీనర్లుగా నరసింహులు, మనోహర్ రెడ్డి, లక్ష్మీపతి, సోమశేఖర్ రెడ్డిని నియమిస్తున్నట్లు పార్టీ ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా సోషల్ మీడియా బృందానికి పార్టీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, కో–కన్వీనర్ చంద్రారెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ అభినందనలు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య



బాలమురళి మృతదేహం

పలమనేరు: పట్టణంలోని పాతపేట శ్రీనగర్ కాలనీకి చెందిన బాల మురళి(45) అనే వ్యక్తి ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పిల్లలు పుట్టలేదని మనస్తాపం చెంది ఉరేసుకున్నట్లు తెలిసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ సుబ్బారెడ్డి కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

మరింత బాధ్యతగా విధులు



పీరూసాబ్



జనార్ధన్



రెడ్డిప్రసాద్



వినోద్‌కుమార్

బైరెడ్డిపల్లి: వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా మండల కన్వీనర్లు, కో–కన్వీర్లుగా మరింత బాధ్యతతో విధులు నిర్వర్తిస్తామని పీరూసాబ్, జనార్ధన్, పురుషోత్తం, రెడ్డి ప్రసాద్, రెడ్డెప్ప, వినోద్‌కుమార్ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ తమను నియమించిన ఎమ్మెల్యే వెంకటేగౌడ, డీసీసీబీ చైర్‌పర్సన్ మొగసాల రెడ్డెమ్మ, రాజంపేట నియోజకవర్గం పార్టీ ఎన్నికల పరిశీలకుడు బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, జెడ్పీటీసీ సభ్యుడు ఆర్.కేశవులు, వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి దయానందగౌడ్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

లెదర్‌బాల్ క్రికెట్ విజేత ‘ఫాల్కన్స్ వింగ్స్’



విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న నిర్వాహకులు

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం నిర్వహించిన లెదర్‌బాల్ క్రికెట్ ఫైనల్స్‌లో ఫాల్కన్స్‌వింగ్స్ జట్టు విజేతగా నిలిచింది. విన్నర్స్‌కు ట్రోఫీని స్వగృహా స్వీట్స్ యజమాని శివ, రఘునాథ్ అందించారు. కార్యక్రమంలో ఏపీపీ రంజిత్‌షా, విన్నర్స్ జట్టు సారథి షోయబ్, రన్నర్స్ కెప్టెన్ నూతన్ పాల్గొన్నారు.

పవిత్రం.. గీతా పారాయణం





గంగవరం : భగవద్గీత పంపిణీలో సేవా సమితి సభ్యులు, కుప్పంలో..

గంగవరం: భగవద్గీత పారాయణం అత్యంత పవిత్రమని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు తెలిపారు. ఆదివారం మండలంలోని నడింపల్లెలో హిందూ ధర్మప్రచారంలో భాగంగా భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రాసిన త్రైత సిద్ధాంత గ్రంథాల విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో సమిత అధ్యక్షుడు భాస్కర్, సభ్యులు ధనుంజయ, బాలాజీ, హేమంత్, రాజేంద్ర, మునిరత్నం, జ్యోతి పాల్గొన్నారు.

కుప్పంరూరల్: పట్టణంలోని ప్యాలెస్ ఎక్స్‌టెన్షన్‌లో ప్రబోదానంద రచించిన పుస్తకాలపై సేవా సమితి సభ్యులు ప్రచారం చేపట్టారు. సమితి సభ్యుడు కృష్ణ మాట్లాడుతూ త్రైత గీతను పఠించడం ద్వారా జ్ఞానం, శాంతి కలుగుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో మంజునాథ్, సుధాకర్, శరవణ, కృష్ణ, ఇందిర, వెంకటలక్ష్మి, పూజా పాల్గొన్నారు.

గృహప్రవేశ వేడుకలో జెడ్పీ చైర్మన్



పెద్దపంజాణి: మండలంలోని కంగానంబండలో ఆదివారం నిర్వహించిన బి.రాజారెడ్డి గృహ ప్రవేశ వేడుకలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పాల్గొన్నారు. రాజారెడ్డి దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, నాయకులు రాజారెడ్డి, అమరనాథరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు నివాళి



జయమ్మ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: మండలంలోని చింతమాకులపల్లె పంచాయతీ పసలమంత గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత జయమ్మ ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు వెంటనే గ్రామానికి చేరుకుని జయమ్మ భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వృద్ధుడికి..

పెద్దపంజాణి: మండలంలోని శంకరాయలపేట గ్రామానికి చెందిన వి.వెంకట్రామయ్య వృద్ధాప్య సమస్యలతో శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆదివారం గ్రామానికి వెళ్లి భౌతికకాయానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు హరినాథ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ముమ్మూర్తుల శక్తి.. మూగజీవులకు ముక్తి

శివుడిని పూజిస్తున్న మూగజీవాలు



శ్రీకాళహస్తీశ్వరాలయం దేశంలోని ఇతర శైవాలయాలతో పోలిస్తే ఒకింత భిన్నం. మూగజీవులైన (శ్రీ–కాళ–హస్తిలకు) సాలీడు..సర్పరాజం.. ఏనుగు భక్తికి మెచ్చి.. ఆ మూడు జీవులకు శివసాయిజ్యం ప్రసాదించిన ముక్తి ప్రదాత. అందుకే ఇది సద్యోముక్తి క్షేత్రంగా(అడుగిడిన వెంటనే ముక్తిని ప్రసాదించే), భక్తుల పాలిట దక్షిణ కైలాసంగా ఖ్యాతి గాంచింది. అందుకే ఇక్కడ నిర్వహించే బ్రహ్మోత్సవాలంటే ముల్లోకాలకు పండుగే. నేటి నుంచి శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ పుణ్యక్షేత్రంపై ప్రత్యేక కథనం. – శ్రీకాళహస్తి



విద్యుత్ వెలుగుల్లో శ్రీకాళహస్తి పట్టణం



ఆలయంలో విద్యుద్దీపాలంకరణ



ధ్వజస్తంభం

మూగజీవులకు ముక్తి నిచ్చిన భూతల కైలాసంగా శ్రీకాళహస్తి క్షేత్రం ఖ్యాతి గాంచింది. ఈ వాయులింగేశ్వర క్షేత్రం మహాశివరాత్రికి సన్నద్ధమైంది. దేవస్థానం భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. మూగజీవాలకు ముక్తితో శ్రీకాళహస్తి అనే పేరు సార్థకమైంది. కృతయుగంలో సాలెపురుగు (శ్రీ), పాము (కాళ), ఏనుగు (హస్తి)ఒకదానికి తెలియకుండా ఒకటి శివుడ్ని నిత్యం పూజించేవి. శివలింగాన్ని ఎండ వానల నుంచి రక్షించేందుకు సాలె పురుగు గూడు అల్లి పూజించేది. పాము రత్నాలు, ముత్యాలతో.. ఏనుగు తొండంతో నీరు తెచ్చి అభిషేకం చేసి ఫల, పుష్ప, పత్రాలు పెట్టి పూజించేది. అయితే ఎవరో శివుడికి హాని చేసే కార్యక్రమం తలపెడుతున్నారని వేటికవి భయపడుతాయి. ఏనుగుని సంహరించాలని పాము తొండంలో దూరి బాధపెడుతుంది. ఆ బాధను భరించలేక తొండాన్ని బండకు ఢీ కొట్టి ఏనుగు మరణిస్తుంది. ఏనుగు తొండంలో ఉన్న పాము కూడా మృతి చెందుతుంది. శివలింగానికి పైన ఉన్న సాలెపురుగు కూడా మరణిస్తుంది. శివుడు ఈ మూడింటికి ముక్తిని ప్రసాదిస్తాడు. శివైక్యం పొందిన వాటి రూపంలోనే శివలింగం మొత్తం సర్ప శరీరంగా దర్శనమిస్తోంది. పైనుంచి కింది వరకు ఏనుగు దంతాలు, అడుగు భాగంలో సాలెపురుగు ఆకారాన్ని పోలి ఉంటుంది. ఏనుగు దంతాల మధ్యలో భక్తుడైన కన్నప్ప కన్ను కనిపిస్తుంది. అందుకే ఈ క్షేత్రం శ్రీ,కాళహస్తిగా పేరు గాంచింది.

పల్లవించెను నాడు.. పరిమళించెను నేడు

దేశంలో ఎక్కడా లేని విధంగా శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని నిర్మించారు. శైవ, స్కంధ, లింగ పురాణాల ప్రకారం బ్రహ్మ శివానుగ్రహంతో కైలాసం నుంచి శ్రీకాళహస్తీశ్వర విగ్రహాన్ని తెచ్చారని, అందువల్ల ఈ కొండకు కైలాసగిరి అని పేరు వచ్చిందంటారు. అర్జునుడు తన తీర్థయాత్రలో ఈ స్థలాన్ని దర్శించి కైలాస నాథీశ్వరున్ని పూజించారు. భరద్వాజ మహర్షి ఇక్కడే తపస్సు చేసి స్వర్ణముఖి నది పవిత్రతను వివరించారని పురాణ కథనం. కైలాసగిరికి దిగువన ఉన్న ఆలయాన్ని మొదట పల్లవరాజులు, తరువాత తొండమాన్ చక్రవర్తి నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. చోళులు ప్రధాన ఆలయాన్ని పునరుద్ధరించారు. 11వ శతాబ్దంలో కుళోత్తుంగ చోళుడు గాలిగోపురాన్ని కట్టించారు. నారాయణవనాన్ని పరిపాలించిన వీరనరసింహ యాదవరాయుడు 12వ శతాబ్దంలో బయటి ప్రాకారాన్ని, ఆలయం నాలుగు మార్గాలను కలుపుతూ నాలుగు గోపురాలను నిర్మించారు. ఆ కాలంలోనే స్వర్ణముఖినదిపైన ఆనకట్ట నిర్మించారు. 1516లో శ్రీకృష్ణదేవరాయలు నూరు స్తంభాల మండపాన్ని, మరో భారీ గాలిగోపురాన్ని కట్టించారు.1529లో అచ్యుతరాయలు శ్రీకాళహస్తిలో పట్టాభిషేకం చేయించుకున్నాడు. 1912లో నట్టుకోట చెట్టియార్లు రూ.9 లక్షలు వెచ్చించి ఆలయం తుది మెరుగులు దిద్దారు. శ్రీకాళహస్తీశ్వరుడిని దర్శించుకున్న వారికి సకలపాపాలు తొలగి, అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం.